నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | బుధవారం 3 జనవరి 2024 | WARANGAL HANUMAKONDA

# డ్రైవర్ల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

### హెచ్‌పీసీఎల్ లారీ డ్రైవర్ల ఆందోళన


హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

కమలాపూర్, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలతో తమ హక్కులను కాలరాస్తోందని హెచ్‌పీసీఎల్ లారీ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) గ్యాస్ ప్లాంట్ లారీడ్రైవర్లు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 140, 2 జీవోలు తీసుకురావడం వల్ల వాహన ప్రమాదం జరిగితే డ్రైవర్లదే బాధ్యతగా రూ.7లక్షల జరిమానా, 10ఏళ్ల జైలు శిక్ష విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని, వెంటనే ఆ జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్ల అధ్యక్షుడు ధర్మల ప్రతాప్, ఉపాధ్యక్షుడు వంగ కిరణ్, కోశాధికారి మారెల్ల శ్రీనివాస్, పోతిరెడ్డి కోటి పాల్గొన్నారు.


బయ్యారంలో రైతు భరోసాపై అధికారులను అడుగుతున్న రైతు మధు

# రైతులకు భరోసా ఎట్లిస్తరు?

- గ్రామసభలో పలువురు రైతుల సందేహం
- అధికారులు నివృత్తి చేసినా గందరగోళంలో అన్నదాతలు

బయ్యారం, జనవరి 2: అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో రైతులకు అందించే రైతు భరోసా విషయంలో విధి విధానాలు ఏమిటి?, ప్రభుత్వం ఎలా భరోసా కల్పిస్తుందని పలువురు రైతులు సందేహం వ్యక్తం చేశారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలకేంద్రంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించగా, పలువురు రైతులు తమ సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం విషయంలో అనేక సందేహాలు ఉన్నాయని, దరఖాస్తు ఎలా చేసుకోవాలో రైతులకు అర్థం కావడం లేదని రైతులు ఆర్ బుచ్చిరెడ్డి, నంబూరి మధు ప్రశ్నించారు. పెట్టుబడి సాయం రూ.15వేలు యజమానికి ఇచ్చి, కౌలు చేస్తున్న రైతుకు కూడా ఇస్తారా?, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందిస్తారా?, చిన్న, సన్నకారు రైతులు తమకున్న భూమితోపాటు మరికొంత భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తే అతడిని రైతుగా గుర్తించాలా?, లేక కౌలు రైతుగా గుర్తించాలా? రైతుబంధు సాయం అందేవారు.. రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలా వద్దా? అంటూ ప్రశ్నించారు. వారి సందేహాలను తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీడీవో సత్యానారాయణరెడ్డి నివృత్తి చేసినా గందరగోళం నెలకొంది. కొంతమంది ప్రజలు దరఖాస్తు పత్రాలు అందక ఇబ్బంది పడ్డారు.



# దరఖాస్తులు పెండింగ్
# లబ్ధిదారులు వెయిటింగ్

దళితబంధు సాయంపై సర్వత్రా ఆందోళన.. పథకాన్ని హోల్డ్‌లో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

దళితబంధు పథకంపై ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురవుతున్నది. దళితుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ సర్కారు రూ.10లక్షల సాయంతో వారికి ఉపాధి మార్గం చూపగా మొదటి విడుత ఉమ్మడి వరంగల్‌లోని పలు జిల్లాల్లో 546 మందికి లబ్ధి చేకూరింది. అలాగే రెండో విడుత కోసం భూపాలపల్లిలో 1405, ములుగులో 1100, జనగామలో 3300, పరకాల నియోజకవర్గంలో 1100 చొప్పున మొత్తం 6905 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి స్థానిక ఎమ్మెల్యేలతో తుది జాబితాను రూపొందించి ఎస్సీ కార్పొరేషన్‌కు పంపింది. కానీ ఇంతలో ప్రభుత్వం మారడంతో రెండో విడుతకు బ్రేక్ పడింది. పథకాన్ని హోల్డ్ చేసి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టి గ్రౌండింగ్ చేయకపోవడంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి నెల కావస్తున్నా పథకం అమలుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, అధికారులు సైతం సరైన సమాచారం ఇవ్వకపోవడంతో దళిత సంఘాల నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

– ములుగు/జనగామ/జయశంకర్ భూపాలపల్లి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)/పరకాల

### ములుగులో 1100 దరఖాస్తులు

కేసీఆర్ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో ములుగు జిల్లాలో మొదటి విడుత 110 మందికి లబ్ధి చేకూరింది. రూ.10లక్షల చొప్పున వారందరికీ జీవనోపాధి లభించింది. అలాగే రెండో విడుతలో 1100 మందిని ఎంపిక చేయడంతో పాటు కలెక్టర్ తుది జాబితాను ఎస్సీ కార్పొరేషన్‌కు పంపారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పథకం అమలుకు బ్రేక్ పడిం ది. దీంతో ఎంపికైన వారిలో అయోమయం నెలకొం ది. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులకు ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. గతేడాది డిసెంబర్ 30న లబ్ధిదారులంతా కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు యత్నించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. అదే రోజున మేడారం పర్యటనకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గట్టమ్మ దేవాలయం వద్ద దళిత సంఘాల నాయకులు దళితబంధు పథకాన్ని అమలుచేసేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

## రెండో విడుతకు బ్రేక్, అర్జీ పెట్టుకున్న వారిలో అయోమయం

- భూపాలపల్లిలో 1405, ములుగు, పరకాలలో 1100 చొప్పున, జనగామలో 3300 మంది ఎంపిక
- ఎంపికైనా గ్రౌండింగ్ కాకపోవడంపై అందరిలో నిరాశ.. వెంటనే మంజూరు చేయాలని డిమాండ్
- ఆందోళనకు సిద్ధమవుతున్న దళిత సంఘాల నాయకులు


దళితబంధు సాయంతో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఓరుగంటి కవిత

రెండవ విడుత దళితబంధు పథకానికి ఎన్నికలకు ముందే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1405 మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన కేసీఆర్ ప్రభుత్వం మంజూరు ఇచ్చేందుకు సిద్ధం కాగా ఎన్నికల కోడ్‌తో ఆగిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి విడుత 151మందికి కేసీఆర్ ప్రభుత్వం పథకాన్ని వర్తింపచేసి ఆసరాగా నిలిచింది. ఇందులో ఇద్దరికి కొంత డబ్బు రావాల్సి ఉండగా ఇప్పుడు ఫ్రీజ్ చేశారు. అలాగే రెండో విడుతలో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి 948 దరఖాస్తులు రాగా మంథని నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 440, ములుగు నియోజకవర్గంలోని ఐదు గ్రామాల నుంచి 17 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 1405 అప్లికేషన్లు రాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు.

### పరకాల నియోజకవర్గంలో 1100 దరఖాస్తులు

పరకాల: పరకాల నియోజకవర్గంలో మొదటి విడుతలో 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి దళితబంధు అందించారు. బీఆర్ఎస్ సర్కారు అందించిన ఆర్థికసాయంతో పలు యూనిట్లను నెలకొల్పగా మరికొందరు వాహనాలను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. అలాగే 2వ విడుతలో 1100 మందిని ఎంపిక చేశారు. వీరంతా అధికారుల సూచనల మేరకు దళితబంధు ఆర్థికసాయం కోసం బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావొస్తున్నా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం, అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. వెంటనే ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

### జనగామలో 3,300 మంది ఎదురుచూపులు

జనగామ జిల్లాలో మొదటి విడుతలో 185 మందికి రూ.10లక్షల చొప్పున రూ.18.50 కోట్లు విడుదలై వారందరూ ప్రస్తుతం దళితబంధు పథకం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. సెప్టెంబర్‌లో 2వ విడుతలో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున 3,300 మందిని ఎంపిక చేశారు. ఆయా ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తీసుకొని కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఆమోదం తెలిపి తుది జాబితాను ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు పంపారు. ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రక్రియ కొనసాగుతుండగానే ఎన్నికల షెడ్యూల్ వెలువడంతో 2వ విడుత నిధుల విడుదలకు బ్రేక్ పడింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడం, ఎమ్మెల్యేలు మారడంతో అప్పటి ఎమ్మెల్యేలు ఫైనల్ చేసి ఆమోదం పొందిన జాబితాపై జిల్లా అధికారులు నోరు మెదపడంలేదు. అసలు గ్రౌండింగ్ పూర్తికాలేదని, నిధులే రాలేదని, తమ వద్ద ఎలాంటి పెండింగ్ జాబితా లేదని చెబుతున్నారు.

### రూ.5లక్షలు రావాల్సి ఉంది



ఆరు నెలల కింద మా ఆయన సమ్మయ్య పేరు మీద మాకు దళితబంధు వచ్చింది. కిరాణా షాపు పెట్టుకున్నం. మా ఆయన అనారోగ్యానికి గురై మంచం పట్టాడు. ఇద్దరు పిల్లలను సర్కారు బడిల చదివిస్తున్న. నాకు కాలు ఆపరేషన్ జరిగింది. ఇంట్లో పరిస్థితి బాగా లేదు. ఈ కారణం చేత అధికారుల దగ్గరికి వెళ్లడం లేటైంది. నాకు పెండింగ్‌లో ఉన్న రూ.5లక్షలు ఇస్తే షాపును మంచిగా చేసుకుందామనుకున్న. అధికారులను అడిగిన. దసరా ముంగట బిల్లు పెట్టినం అన్నరు. త్వరలో వస్తయన్నరు. అంతలో ఎన్నికలచ్చినయ్. అయిపోయినంక ఇస్తమన్నరు. ఇప్పుడు గవర్నమెంటు మారింది. గవర్నమెంటు చెప్పినప్పుడే డబ్బులు ఇస్తమని అంటున్నరు. దయచేసి నాకు దళితబంధు డబ్బులు పూర్తిగా ఇచ్చి ఆదుకోవాలె. నాకు ఎలాంటి ఆస్తిపాస్తులు, భూములు లేవు. ఈ షాపు ఒక్కటే మాకు దిక్కు.

– ఓరుగంటి కవిత, భూపాలపల్లి

### ప్రభుత్వ ఆదేశాలు వస్తే అమలు చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు పథకాలను అమలు చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబర్‌లో 2వ విడుత లబ్ధిదారుల జాబితాను రూపొందించాం. ఇప్పటివరకు అమలులో ఎలాంటి పురోగతి లేదు.

– తుల రవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ములుగు

### దళితబంధును వర్తింపజేయాలి



గత ప్రభుత్వం అమలుచేసిన విధంగా దళితుల కోసం ఈ ప్రభుత్వం కూడా దళితబంధు పథకాన్ని అర్హులైన ప్రతి దళితుడికి అందించాలి. 2వ విడుతలో ఎంపికైన లబ్ధిదారుల కోసం అప్పటి ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. జిల్లాలో 1100 మంది లబ్ధిదారులను గ్రౌండింగ్ చేసి వారు ఎన్నుకున్న యూనిట్లను అందజేయాలి. ఇప్పటికే అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు ఇచ్చాం. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అర్హులకు న్యాయం చేయాలి.

– కోగిల మహేశ్, దళిత సంఘం నాయకుడు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవితేజ, వెంగళదాసు సాయిరాం (ఫైల్)

# విషాదంగా విహారయాత్ర

- అర్ధరాత్రి చెట్టును ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- మహబూబాబాద్ శివారులో ఘటన
- ఐదుగురూ వరంగల్ నగరవాసులే

మహబూబాబాద్ రూరల్, జనవరి 2: విహారయాత్ర విషాదంగా మారింది. ఐదుగురు స్నేహితులు కలిసి సంతోషంగా కారులో విహారయాత్రకు బయల్దేరగా, మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మహబూబాబాద్ పట్టణ శివారులో జరిగింది. టౌన్ సీఐ సతీశ్ కథనం ప్రకారం.. వరంగల్ శివనగర్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు గుగ్గిళ్ల రవితేజ (29), వెంగళదాసు సాయిరాం(27), సంగినేని సాయిరాం, కదాడ సాయితేజ, పాక లక్ష్మణ్ కలిసి రవితేజ కారులో సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లికి పయనమయ్యారు. ఈ క్రమంలో మహబూబాబాద్ శివారు ఏటిగడ్డతండా వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవితేజ, సాయిరాం అక్కడికక్కడే మృతిచెందారు. సాయితేజ, సాయిరాం, లక్ష్మణ్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 100కు డయల్ చేయగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో మృతదేహాలతో పాటు క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## కారు ఢీకొని బాలుడి మృతి


విజయ్‌ప్రకాశ్

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : కారు ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండల శివారులో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన చింతల సుధాకర్ వినోద దంపతులు, వారి కొడుకు విజయ్‌ప్రకాశ్(8)తో కలిసి సోమవారం మండలంలోని ముత్యాలమ్మగూడెంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లడానికి ముత్యాలమ్మగూడెం క్రాస్ రోడ్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. ఆటో వచ్చిందని రోడ్డు దాటుతున్న క్రమంలో నర్సంపేట వైపు నుంచి కారు వేగంగా వచ్చి బాలుడిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఉచిత ప్రయాణంతో డీజిల్ భారం

### సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎంకు అద్దె బస్సు యజమానుల వినతి


ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం ఇస్తున్న యజమానులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 2: మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు బస్సుల్లో 45 నుంచి 60 మంది ప్రయాణించేవారని ఆ సంఖ్య గణనీయంగా పెరిగి డీజిల్ వాడకంలో తేడా, టైర్లపై భారం, కమాన్‌పట్టీలు విరగడం, బస్సుల మెయింటనెన్స్ విపరీతంగా పెరిగిందని అద్దె బస్సుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం జే శ్రీలతను కలిసి వారు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఇస్తున్న అద్దె బస్ రేటు మరో రూ.2 పెంచాలని, బస్సుల్లో ప్రయాణిస్తున్న అందరికీ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, ఉచిత ప్రయాణంతో ట్రాఫిక్ పెరిగి టైర్లు పగిలిపోతున్నాయని వివరించారు. ఆర్టీసీ వారి టైర్లను హైర్‌బస్సులకూ బల్క్‌రేటుకు ఇవ్వాలని కోరారు. ఓవర్‌లోడ్‌తో కేఎంపీఎల్ బాగా తగ్గిందని, 4.5 కేఎంపీఎల్‌గా ఇవ్వాలని, 5వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎంను కోరారు. రాష్ట్ర నాయకులు ప్రభాకర్, సదానందం, వెంకటేశ్వర్లు, కుమార్, వెంకటరెడ్డి ఉన్నారు.

# అన్నారం బరాజ్ వద్ద మొదలైన పనులు

### రెండు నీటి బుంగల గుంతల వరకు తాత్కాలిక రోడ్డు


అన్నారం బరాజ్ కింది వైపు రోడ్డు వేస్తున్న దృశ్యం

కాళేశ్వరం, జనవరి 2 : అన్నారం(సరస్వతి) బరాజ్ మరమ్మతు కోసం తాత్కాలిక రోడ్డు పనులను అధికారులు ప్రారంభించారు. బరాజ్‌లో రెండు నెలల కింద బ్లాక్-4లో 38వ గేట్, బ్లాక్-3లో 28వ గేట్ వద్ద నీటి బుంగల గుంతలు ఎలా పడ్డాయి? ఎక్కడినుంచి నీరు వస్తుందో తెలుసుకునేందుకు ప్రత్యేకమైన మట్టి, కంకరతో రోడ్డు వేస్తున్నారు. గత నెల 29న మంత్రుల బృందం బరాజ్‌ను పరిశీలించి, మరమ్మతు చేయాలని ఆదేశించింది. ఈమేరకు ఆఫ్కాన్ సంస్థ పనులు చేపట్టగా రెండు రోజుల్లో రోడ్డు పూర్తవుతుందని, ఆ తర్వాత పరీక్షలు ప్రారంభిస్తామని ఇంజినీర్లు తెలిపారు.



## తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హనుమకొండ సబర్బన్, జనవరి 2 : తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని కమిటీ జనరల్ సెక్రటరీ నార్ల సుబ్రహ్మణ్వేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల 2024-25 జనరల్ ఎలక్షన్స్ హంటర్‌రోడ్డులో దీపియా భవన్‌లో నిర్వహించారు. హనుమకొండ జిల్లా సర్కిల్ సెక్రటరీగా ఎం అనిల్‌కుమార్, సర్కిల్ ప్రెసిడెంట్‌గా కే పైడయ్య, ట్రెజరర్‌గా రఘు, వరంగల్ జిల్లా సర్కిల్ సెక్రటరీగా తరుణ్, సర్కిల్ ప్రెసిడెంట్‌గా చంద్రమౌళి, ట్రెజరర్‌గా తిరుపతిరెడ్డి, హనుమకొండ డివిజన్ రూరల్ సెక్రటరీగా డీ ప్రదీప్‌కుమార్, ట్రెజరర్‌గా సుదర్శన్, హనుమకొండ టౌన్ సెక్రటరీగా వీరేంద్ర, ట్రెజరర్‌గా హరినాథ్, వరంగల్ టౌన్ సెక్రటరీగా అశ్విన్, ట్రెజరరీగా నరేశ్, వరంగల్ రూరల్ సెక్రటరీగా వెంకటేశ్, ప్రెసిడెంట్‌గా కనకయ్య, ట్రెజరర్‌గా క్రాంతి, నర్సంపేట డివిజన్ సెక్రటరీగా వెంకటేశ్, ట్రెజరర్‌గా భార్గవి, జనగామ సర్కిల్ సెక్రటరీగా వంశీకృష్ణ, ట్రెజరర్‌గా నిఖిల్‌రెడ్డి, భూపాలపల్లి సర్కిల్ సెక్రటరీగా డీ రాజు, ప్రెసిడెంట్‌గా శైలేంద్ర కుమార్, మహబూబాబాద్ సర్కిల్ సెక్రటరీగా సతీశ్, ప్రెసిడెంట్‌గా చలపతిరావు, ట్రెజరర్‌గా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్‌గా మధుసూదన్, హనుమకొండ ఏడీఈ మల్లికార్జున్, ఎలక్షన్ ఆఫీసర్లుగా కే శ్రీకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# తూములు, కాల్వలకు మరమ్మతు చేయాలి

- సాగునీటి సమస్యను పరిష్కరించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం


తూములను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 2: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని రిజర్వాయర్ తూములు, పంట పొలాలకు నీరందించే కాల్వలకు మరమ్మతు చేసి యాసంగికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రైతులు, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి రిజర్వాయర్ కట్టను, తూములను పరిశీలించారు. తూముల వద్దకు కాలినడకన, ఆటోలో వెళ్లారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడారు. ఎత్తిపోతల పథకం ద్వారా 48వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో స్టేషన్‌ఘన్‌పూర్ పెద్ద చెరువును, రాజవరం చెరువును కలిపి రిజర్వాయర్‌గా మార్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. రిజర్వాయర్ కింద ఉన్న నాలుగు పాత తూములు పూడుకుపోయాయని, పంట కాల్వల్లో మట్టి, తుంగ పెరిగిందన్నారు. కాల్వలు అక్కడక్కడ కొంత దెబ్బతిన్నాయన్నారు. పంట కాల్వల ద్వారా గ్రామంలోని మురుగు నీరు పొలాల్లోకి చేరడంతో సాగు చేయలేకపోతున్నందున సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారని ఆయన వివరించారు. ముందుగా రైతులకు సాగు నీరు అందించేందుకు తాత్కాలికంగా వారం రోజుల్లో పంట కాల్వల్లో మట్టిని, తుంగను తొలగించి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కాల్వల ద్వారా సుమారు 4800 ఎకరాలకు సాగునీరు అందుతున్నదని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన సమగ్ర సర్వే ఎస్టిమేట్లు చేసి ఇవ్వాలని అధికారులను కోరినట్లు కడియం తెలిపారు. కట్టపై చెట్లను తొలగించి సుందరీకరణ పనులను త్వరలోనే చేపడతామని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకన్న, శంకర్, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజు, నర్సింహులు, యాదవ్, రాజు, సొసైటీ డైరెక్టర్ తోట సత్యం పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కడియం పంపిణీ చేశారు. చెక్కులను ఈ నెల 6లోగా బ్యాంకులో జమ చేసుకోవాలని కోరారు. ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీందర్, జడ్పీటీసీ రవి, ఎంపీపీ కందుల రేఖ, సర్పంచ్‌లు సురేశ్, సారంగపాణి, నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, సర్పంచ్‌ల ఫోరం చిల్పూరు మండల అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.